సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 17 । జూలై । 2023



ఉత్సాహంగా అండర్-19 టోర్నమెంట్

కడపలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్లకు 383 పరుగులు చేసింది. -8లో



దైవ దర్శనానికి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

దైవ దర్శనానికి వెళ్తుండగా విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.4/27.9

వాతావరణం

జిల్లాలో ఆదివారం 27.9 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వాహనాల తనిఖీ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించి అణువణువు క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీకేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధిస్తామన్నారు. ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్, నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా కట్టడి చేస్తూ ప్రజలకు అన్ని వేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

23న సాహిత్య సదస్సు

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 23వ తేది ఉదయం 10.00 గంటల నుంచి సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు వైవీయూ సభ్య కార్యదర్శి, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య తెలిపారు. నెల నెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం జింకా సుబ్రమణ్యం జీవితం-సాహిత్యం అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన ఉపాధ్యాయులు కొత్తపల్లి శ్రీను ప్రసంగించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నేడు సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 17వ తేదీ సోమవారం సాయంత్రం 4.30 గంటలకు జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎస్. సహదేవరెడ్డి తెలిపారు. 01-01-2010 తర్వాత పుట్టిన వారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు తూర్పుగోదావరిజిల్లా రామచంద్రాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి లైఫ్‌స్కిల్ శిక్షణ తరగతులు

కడప స్పోర్ట్స్: రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు వ్యాయామ ఉపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లకు లైఫ్‌స్కిల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈఓ వై. రాఘవరెడ్డి తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులకు జిల్లా నుంచి ఎంపికైన 500 పాఠశాలల నుంచి ఒక వ్యాయామ ఉపాధ్యాయులు, ఒక సబ్జెక్టు టీచర్ పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. విజయవాడలో శిక్షణ పొందిన ఎస్ఆర్‌టీలు ఎస్. జిలానీబాషా, రమేష్‌బాబు, దేవకి, హసీన, డైట్ లెక్చరర్స్ శ్రీదేవి, శివభాస్కర్, నాగేశ్వరరావు, జాఫర్‌ల ఆధ్వర్యంలో రీజినల్ మేనేజర్ శ్యామ్, ఫెలిసిటేటర్ ప్రణవి, శివకిశోర్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లింగాలలో పాండిచ్చేరి వర్సిటీ విద్యార్థుల పరిశోధనలు



లింగాల అటవీ ప్రాంతంలో ఎర్రరాళ్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

లింగాల: లింగాల మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులు పరిశోధనలు నిర్వహించారు. ప్రొఫెసర్ నూరుల్ అబ్బార్ ఆధ్వర్యంలో సుమారు 50మంది ఎర్త్ సైన్స్‌కు సంబంధించి పరిశోధనలు జరిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నూరల్ అబ్బార్ మాట్లాడుతూ ఎమ్మెస్సీ జియాలజీకి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఎర్త్ సైన్స్‌కు సంబంధించి నేలలు, రాళ్లు, కొండలు, వాటి స్వభావాన్ని ప్రాక్టికల్‌గా తెలుసుకోనున్నట్లు తెలిపారు.

జీఎస్టీ నిబంధనలపై అవగాహన అవసరం

కడప కల్చరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా ట్యాక్స్ రంగంలో జీఎస్టీ వినూత్నమైన అంశాలతో ప్రవేశించిందని, వీటి నిబంధనల పట్ల వ్యాపారులు కనీస అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని హైదరాబాదుకు చెందిన జీఎస్టీ నిపుణులు సుధీర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కడపలోని మానస ఇన్ హోటల్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ కడప, పరిశ్రమలశాఖలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. చాంబర్ ఆఫ్ కామర్స్ కడప అధ్యక్షుడు రామ్మూర్తి జీఎస్టీ నిపుణులు సుధీర్‌ను సభికులకు పరిచయం చేశారు. ఆయన జీఎస్టీ చట్టాలు, వస్తున్న నూతన మార్పుల గురించి వివరించారు. జిల్లా వ్యాపారులు, చాంబర్స్ ఆఫ్ కామర్స్, చార్టెర్డ్ అకౌంటెంట్లకు పలు అంశాలను వివరించారు. ఈ అంశాల్లో వారికి గల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు వ్యాపారులు, చార్టెర్డ్ అకౌంటెంట్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కురవని వాన.. కర్షకుడి హైరానా

వరుణుడు ముఖం చాటేశాడు. అదును దాటుతున్నా ఇంతవరకు పదును వాన కూడా పడకపోవడంతో రైతులు పంటల సాగుకు పూర్తి స్థాయిలో ఉపక్రమించలేకపోతున్నారు.

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా మొదలు కానీ వ్యవసాయ పనులు
- జిల్లాలో ఇప్పటిదాకా కేవలం 8014 హెక్టార్లలో పంటల సాగు
- ఈ నెలా వర్షాలు కురవకుంటే ప్రత్యామ్నాయమే
- ప్రత్యామ్నాయ పంటలకు సాగుకు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు



పచ్చిక లేక రాళ్లలో మేస్తున్న గొర్రెలు

కడప అగ్రికల్చర్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటింది. ఇప్పటి దాకా భూమి మీద పదును వాన కురవలేదు.. ప్రభుత్వమేమో రైతన్నలకు కావాల్సిన వేరుశనగ, జీలుగ విత్తనాలు పంపిణీ చేసింది. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను సిద్ధంగా ఉంచింది. రైతులు కూడా కాడీ, మేడీ సిద్ధం చేసుకున్నారు. కానీ వరణ దేవుడు మాత్రం కురుణించలేదు. సాధారణంగా ఈ పాటికి తొలకరి చినుకులతో పొలాలన్నీ పచ్చికతో కళకళలాడుతూ ఉండేవి. ప్రస్తుతం భూములన్నీ బీళ్లుగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో 8014 హెక్టార్లలో సాగైన పంటలు...

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 77105 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కావాల్సి ఉంది. ఇప్పటికి 8014 హెక్టార్లలో మాత్రమే పలు పంటలు సాగయ్యాయి. సాధారణంగా ఈ పాటికి 20 వేల హెక్టార్లకు పైగా పంటలు సాగు కావాల్సి ఉంది. సరైన వర్షం కురవక పోవడంతో బోరు బావుల కింద అక్కడక్కడ మాత్రమే పంటలు సాగయ్యాయి. . ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేయాల్సిన పరిస్థితులు తప్పవు. జిల్లాలో ఇప్పటి దాకా వరి 1278 హెక్టార్లలో, 18 హెక్టార్లలో జొన్నలు, 78 హెక్టార్లలో సజ్జలు, 257 హెక్టార్లలో మొక్కజొన్న, 7 హెక్టార్లలో కొర్ర, మరో 7 హెక్టార్లలో చిరుధాన్యాలు, 112 హెక్టార్లలో కంది, 27 హెక్టార్లలో పెసలు, 687 హెక్టార్లలో మినుము, 1429 హెక్టార్లలో వేరుశనగ, 4 హెక్టార్లలో నువ్వు, 62 హెక్టార్లలో సన్ ఫ్లవర్, 76 హెక్టార్లలో ఆముదం, 278 హెక్టార్లలో సోయాబీన్, 2817 హెక్టార్లలో పత్తి, 20 హెక్టార్లలో చెరకు, 191 హెక్టార్లలో మిరప, 278 హెక్టార్లలో ఉల్లి పంటలు సాగయ్యాయి.

ఆశలన్నీ కేసీ కెనాల్‌పైనే..

పై ప్రాంతంలో వర్షలు భాగా కురిస్తే శ్రీశైలం డ్యాం నిండి కేసీ కెనాల్‌కు నీరు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటి వరకు పెద్ద వర్షం కురవలేదు. కాకపోతే ఆగస్టు లోగా పెద్ద వర్షం కురుస్తుందని రైతన్నలు ఆశగా ఎదురుచేస్తున్నారు. కేసీ కెనాల్‌కు నీరు వస్తే పంటలసాగు బాగా పెరిగే అవకాశం ఉంటుంది.

జిల్లాలో సాధారణ సాగు: 77105 హెక్టార్లు
ఇప్పటి వరకు సాగైన పంటలు: 8014 హెక్టార్లు
బీడు భూములు: 69,091 హెక్టార్లు



ఖరీఫ్ సీజన్ వర్షపాత వివరాలు..



జూన్‌లో కురవాల్సిన వర్షం: 68.2 మి.మీ
కురిసిన వర్షం: 38.7 మి.మీ
జూలైలో కురవాల్సిన వర్షం: 96.7 మి.మీ
15వ తేదీ నాటికి కురిసినది : 23 మి.మీ

జిల్లాలో సాగైన పంటల వివరాలు (హెక్టార్లలో)

పంట	సాధారణ సాగు	సాగైంది
వరి	33215	1278.44
జొన్న	1331	18.4
సజ్జలు	1025	78
మొక్కజొన్న	574	256.8
కొర్ర	936	07
పెసలు	243	27.4
మినుము	1814	687.44
కంది	3453	112
కాటన్	21547	2816.5
వేరుశనగ	5736	1429
సన్‌ఫ్లవర్	1169	62

ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేశాం



జూలై చివరి వరకు వర్షాలు కురవకపోతే ప్రత్నామ్యాయ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేశాం. అందుకు సంబంధించి అవసరమైన విత్తనాల ప్రణాళికను రూపొందంచి ప్రభుత్వానికి పంపించాం. అప్పటికి వర్షం రాకపోతే అందుకు తగ్గట్లు చర్యలు తీసుకుంటాం.
- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

శాకంబరీదేవిగా రెడ్డెమ్మతల్లి



అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మ తల్లి ఆదివారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయంలో శాకంబరీ దేవి ఉత్సవాలు నిర్వహించారు. జేష్టమాసం తరువాత వచ్చే ఆషాడమాసంలో జగన్మాతను శాకంబరీ దేవిగా పూజించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఈనేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయాన్నే అమ్మవారికి పలురకాల నైవేద్యాలు సమర్పించి కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. శాకంబరీదేవి ప్రాశస్త్యం గురించి అర్చకులు భక్తులకు తెలియజేసి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆలయానికి తమిళనాడు, కర్ణాటకాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని మహిళలు పెద్ద ఎత్తున సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట వరపడ్డారు. పలువురు ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. -గుర్రంకొండ

కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప, కురుబ సంఘ నాయకులు

మదనపల్లె : రాయలసీమలో అధికసంఖ్యలో ఉన్న కురబలకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కురుబసంఘం రాష్ట్ర నాయకులు, రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప తెలిపారు. ఆదివారం పట్టణంలోని అయోధ్యనగర్ శ్రీరామ కల్యాణ మండపంలో రాష్ట్ర కురుబల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి కర్నూలు, అనంతపురం, ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన కురబకుల ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప మాట్లాడుతూ.. కురుబలలో ఐక్యత లేని కారణంగా తీవ్రంగా నష్టపోవడం జరుగుతోందన్నారు. అందరూ ఐకమత్యంతో ఏకతాటి పైకి రావాలని పిలుపునిచ్చారు. తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని, సామాజికంగా, ఆర్థికంగా పైకి వచ్చేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులు తమకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న 36 నియోజకవర్గాల్లో కుప్పం నుంచి కర్నూలు వరకు 30లక్షలకు పైగా కురుబలు ఎన్నికల్లో గెలుపు, ఓటములు నిర్దేశించేస్థాయిలో కీలకంగా ఉన్నామన్నారు. అనంతపురం జిల్లాలో వైఎస్సార్ సీపీ 2 ఎమ్మెల్యేలు, 1 ఎంపీ, 1 బీసీ కమిషన్ మెంబర్‌గా అవకాశం కల్పించిందని, కర్నూలు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధిక సంఖ్యలో కురుబలు ఉన్నప్పటికీ అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. దేశజనాభాలో 50శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు, సమాన అవకాశాలు దక్కడం లేదన్నారు. కురుబలు ఇతర బీసీ కులాలతో సమన్వయం చేసుకుని రాజ్యాధికారం దిశగా ముందుకెళతామన్నారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండురామాంజులు, నాయకులు బెల్లేరెడ్డిప్రసాద్ మాట్లాడుతూ కనకదాస విగ్రహాలను ప్రతినియోజకవర్గంలో ఏర్పాటుచేసేందుకు స్థలాలను కేటాయించాలన్నారు. మాదాసి, మాదారి కురుబలకు రెవెన్యూఅధికారులు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు ఆరెళ్ల జయప్ప, బోరంపల్లె ఆంజనేయులు, ఎస్.ఈశ్వరయ్య, నాగభూషణం, దొనస్వామి, బుల్లేలింగప్రసాద్, కనుగొండ్లరాజేష్, సామకోటి ఆదినారాయణ, జెడ్పీటీసీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కల సాకారం

- రైతుల శ్రేయస్సే జగనన్న ధ్యేయం
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



రిబ్బన్ కట్ చేసి పంప్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

లింగాల: లింగాల మండల కేంద్రంలోని పాత చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించి కొత్త చెరువుకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కల సాకారమైందన్నారు. పులివెందుల నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే ఆయన ధ్యేయమన్నారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతుల శ్రేయస్సు కోసం ఎన్నో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి చెరువులకు, కుంటలకు నీటిని విడుదల చేస్తున్నారన్నారు. దీనివల్ల భూగర్భజలాలు పెంపొంది రైతులు నిశ్చింతగా ఏడాదికి మూడు పంటలు పండించుకునే అవకాశం ఉందన్నారు. అంతకముందు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలను వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కొత్త చెరువుకు నీటిని విడుదల చేయడంవల్ల లింగాల, పెద్దకుడాల, అక్కులగారిపల్లె, తేర్నాంపల్లె, ఎర్రంరెడ్డిపల్లె గ్రామా ల్లో 2వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఎత్తిపోతల పథక పంప్‌హౌస్‌ను ఎంపీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మహానేత వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంప్‌హౌస్ వద్ద పూజలు నిర్వహించి స్విచాన్ చేసి ఎత్తిపోతల పథకాన్ని ఎంపీ ప్రారంభించారు. వనంబావి సమీపానికి చేరుకుని ఎత్తిపోతల పథకం ద్వారా కొత్త చెరువుకు పరుగులు తీస్తున్న నీటికి ఆయన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, లింగాల, సింహాద్రిపురం మండలాల వ్యవసాయల సలహా మండలి చైర్మన్లు కర్నా రమేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగభూషణంరెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్లు జగన్ మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు ఎ.వి.శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి, ఏఈ ప్రదీప్‌రెడ్డి, వాసుదేవా రెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సౌమ్యనాథా.. దక్షిణ గాలిగోపురమేది.!

- చెన్నై లైబ్రరీలో ఆధారాలు ?
- ఆధారాలు ఉంటేనే సెంట్రల్ ఆర్కియాలజీ ముందడుగు



మొండిగోడలతో ఉన్న దక్షిణగాలిగోపురం

రాజంపేట: దక్షిణభారతదేశంలో దేవతలు కట్టిన కోవెలగా ప్రసిద్ధి చెందింది నందలూరు సౌమ్యనాథాలయం. ఆలయాలకు గాలిగోపురాలు ఉంటేనే వాటికి శోభ. దశాబ్దాల కాలం నుంచి దక్షిణగాలి గోపురం నిర్మాణాన్ని సెంట్రల్ ఆర్కియాలజి గాలికి వదిలేసిందని భక్తులు పెదవి విరుస్తున్నారు. ఈ ఆలయానికి సంబంధించి పూర్తి ఆధారాలు తమిళనాడులోని చెన్నై ప్రధాన లైబ్రరీలో ఉన్నట్లు, వాటిని తీసుకురావడానికి ఆలయాభివృద్ధికి కృషి చేసిన వారిలో ఒకరైన కొండపల్లె సుబ్బరాయుడు ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన మృతి చెందిన తర్వాత దక్షిణగాలిగోపురం నిర్మాణం కృషి ఆటకెక్కిందనే భక్తులు పేర్కొంటున్నారు. మూడు గాలిగోపురాలు ఉండి, ఒకటి లేదంటే ఆలయానికి వాస్తుపరంగా దోషం ఉన్నట్లుగా భక్తులలో ప్రచారం జరుగుతోంది. ఉన్న రెండు గాలిగోపురాలే ఆధారమని, సెంట్రల్ ఆర్కియాలజీ వెంటనే నిర్మితం చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

ఆలయనిర్మాణం ఇలా

విశాలమైన ప్రాంగణంలో.. నాలుగు రాజగోపురాల మధ్య ఉన్న ఈ ఆలయం పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. 108 స్తంభాలు ఉంటే , అన్నింటిపైన భాగవతం రచించి ఉండటం కనిపిస్తుంది. 11వ శతాబ్దంలో కులోత్తుంగచోళుడు ఈ ఆలయ నిర్మాణానికి పూనుకున్నాడని , అలా పునః ప్రారంభమైన ఈ క్షేత్ర నిర్మాణంలో పాండ్య, కాకతీయ, విజయనగరాజులు సైతం పాల్గొన్నారని చరిత్ర చెబుతున్న సత్యం.

ఆధారంలేకనే గాలిగోపురం నిర్మాణం ప్రశ్నార్థకం

ఆధారం లేకనే దక్షిణ గాలిగోపురం నిర్మాణం నేటి ప్రశ్నార్థకంగా మారింది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలను కలుపుతూ పెద్దఎత్తున రక్షణ గోడ నిర్మాణం జరిగింది.దశాబ్దాల కింద గాలివానకు పక్కనున్న చెట్టు పడి దక్షిణ గాలి గోపురం కూలిపోయినట్లు పూర్వీకులు నేటికీ చెప్పుకుంటుంటారు. ఆలయాన్ని కేంద్రపురావస్తుశాఖ తన పరిధిలోకి తీసుకున్న తర్వాత గాలిగోపురాన్ని ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులు పరిశీలించి వెళ్లారు. కానీ ఫలితం లేకుండాపోయింది. కేవలం గాలిగోపురం ఉన్నట్లు ఆధారాలు ఉంటేనే నిర్మితం చేస్తామని కేంద్రపురావస్తుశాఖ చెబుతోంది. గతంలో మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కారదర్శి సీ.రామచంద్రయ్య దృష్టికి దక్షిణగాలిగోపురం నిర్మాణం విషయం స్థానికులు తీసుకెళ్లారు. ఆయన కూడా ఈ విషయం అప్పట్లో ఢిల్లీ స్థాయిలో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు అప్పటి సమాచారం. కొన్నేళ్లుగా కేంద్రపురావస్తుశాఖ దక్షిణగాలిగోపురం.. ఆలయ ప్రహరీ విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆలయం ప్రహరీగోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల పై భాగంలో ఉన్న ఇటుకల నిర్మాణం కూలిపోవడంతో మొండిగోడలతో దర్శనిమిస్తున్నాయి. ఆలయ రక్షణ గోడలను ఇంతవరకు ఎక్కడా కూడా పునరుద్ధరించిన దాఖాలాలు కనిపించలేదు.

కేంద్ర పురావస్తుశాఖ దృష్టి సారించాలి



టీటీడీలో విలీనం తర్వాత సౌమ్యనాథాలయం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. ఆలయంలో తూర్పు, ఉత్తర గాలి గోపురాలు ఉండి, దక్షిణ గాలిగోపురం లేకుంటే వెలితిగా కనిపిస్తోంది. ఈ విషయంపై కేంద్రపురావస్తుశాఖ దృష్టి సారించాలి. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ద్వారా ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి దక్షిణగాలిగోపురం నిర్మాణం తీసుకెళ్లేందుకు కృషి చేస్తా.
-మేడామధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు, నందలూరు

దక్షిణగాలిగోపురం నిర్మిస్తే మరింతసుందరంగా ఆలయం



దక్షిణ గాలిగోపురాన్ని కేంద్రపురావస్తుశాఖ నిర్మించాలి. ఆలయంలో రెండు గాలిగోపురాలు ఉండి, ఒక గాలిగోపురం మొండిగా కనిపిస్తోంది. టీటీడీలోకి విలీనం తర్వాత ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిల కృషితో సౌమ్యనాథాలయం అభివృద్ధి చెందింది.
-సోమిశెట్టి సునీతా ప్రభాకర్, ఎంపీటీసీ, నందలూరు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు బేసిక్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ, జిల్లా పరిషత్తు ఉపాధ్యాయుల సమస్యలను కొలిక్కి తెచ్చి ఎంఈఓ 1,2 ద్వారా పరిష్కరించి వారికి ప్రమోషన్ వచ్చే విధంగా, 12వ పీఆర్‌సీ ద్వారా ఉపాధ్యాయులకు మెరుగైన ఫిట్‌మెంట్ అందేలా కృషి చేస్తామన్నారు. ఏపీ ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 12 పీఆర్‌సీ కమిటి ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఫిట్‌మెంట్ 42 శాతం తగ్గకుండా ప్రకటించాలన్నారు. సమావేశంలో ఏపీ ఎస్‌టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు,రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాలకు మురళి, మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి రామసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకులు ఆవుల శ్రీనివాసులు, వెంకటసుబయ్య, గౌరవ సలహాదారు శంకరయ్య, జాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా నగరేశ్వరునికి అన్నాభిషేకం


అన్నాభిషేకంలో నగరేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున వాసవీమాతకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. నగరేశ్వరునికి అన్నాభిషేకం చేశారు. మహాలింగార్చన, సప్తశతీ చండీ పారాయణం, రుద్ర హోమం, చండీహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

కలికిరి : భార్య ఆత్మహత్య కేసులో నాలుగేళ్ల తరువాత సౌదీ నుంచి వచ్చిన భర్తను కలికిరి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మండలంలోని గుండ్లూరుకు చెందిన షాదికున్నిషా 2019లో భర్త షేక్ బావాజాన్, అత్త చోటీజాన్, ఆడపడుచు మహబూబ్ జాన్‌ల వరకట్న వేధింపులతో ఆత్మహత్య చేసుకుని మరణించింది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం అత్త, ఆడపడుచును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భర్త సౌదీలో ఉండటంతో వాల్మీకిపురం కోర్టు ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయగా.. ఉమ్మడి చిత్తూరు జిల్లా అప్పటి ఎస్పీ నివేదిక ప్రకారం ప్రభుత్వం నిందితునిపై లుక్‌ఔట్ నోటీసు జారీ చేసింది. ఈ క్రమంలో నిందితుడు సౌదీ నుంచి ఆదివారం బెంగళూరులోని ఎయిర్‌పోర్టుకు రాగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని వాల్మీకిపురం కోర్టుకు తరలించారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి గాయాలు

ఓబులవారిపల్లె : దైవ దర్శనానికి వెళ్తుండగా విషాదం చోటుచేసుకుంది. మార్గంమధ్యలో మృత్యువు కబళించింది. ఆ ప్రాంతంలో రోదనలు, ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆదివారం బోయకొండ గంగమ్మతల్లి ఆలయానికి వెళ్తుండగా.. మండలంలోని చిన్నఓరంపాడు అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓబులవారిపల్లెలోని కటికంవారిపల్లి బలిజపల్లెకు చెందిన ఎన్ఆర్ నరసింహులు(60), తన భార్య లీలావతితో కలిసి బంధువులతో టాటా ఏసీ, సుమో వాహనాలలో బోయకొండ ఆలయానికి ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరారు. చిన్నఓరంపాడు అడ్డరోడ్డు వద్దకు రాగానే టాటా ఏసీ వాహనం డాబా హోటల్ వద్ద ఎదురుగా ట్రాక్టర్ నిలిచి ఉండటంతో ఒక్కసారిగా పక్కకు తిప్పాడు. దీంతో ఆ వాహనం వెనుకభాగం ట్రాక్టర్‌ను తగలడంతో.. వాహనం ఎగిరి కిందపడింది. డ్రైవర్ సీటు పక్కనే కూర్చొని ఉన్న ఎన్ఆర్ నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల వారు వాహనాన్ని పైకిలేపి తీవ్రంగా గాయపడ్డ అరిగెల శంకరమ్మ(44)ను అంబులెన్సులో రైల్వేకోడూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. లీలావతికి తలపై తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆటోలో 8 మంది ప్రయాణిస్తుండగా.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.


ప్రమాదానికి గురైన వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి

గల్ఫ్ నుంచి ఇటీవల వచ్చి..

ఎన్ఆర్ నరసింహులు ఇటీవల గల్ఫ్ దేశం నుంచి స్వగ్రామానికి వచ్చాడు. మొక్కు తీర్చుకునేందుకు బోయకొండ గంగమ్మతల్లి గుడికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నరసింహులుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అరిగెల శంకరమ్మ గ్రామంలో కిరాణ దుకాణం నడుపుకొంటూ జీవనం సాగిస్తుండేది. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలంలో మృతుల, బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు. వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. డ్రైవర్ వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


శంకరమ్మ (ఫైల్)


నరసింహులు (ఫైల్)


ఎన్ఆర్ నరసింహులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


మృతి చెందిన అరిగెల శంకరమ్మ

వరుణుడి కరుణ కోసం బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

చిన్నమండెం : 'వరుణ దేవా.. కరుణించవా' అంటూ గ్రామస్తులు వేడుకున్నారు. సమృద్ధిగా వానలు కురవాలి, పంటలు పండాలని కోరుకున్నారు. మండల పరిధి దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని కురవపల్లెలో బైరేగునికి బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నో దశాబ్దాలుగా వర్షాలు సకాలంలో కురవని పక్షంలో.. ఈ గ్రామంలో ఆనవాయితీగా బోనాల కార్యక్రమం నిర్వహిస్తారు. శనివారం రాత్రి చింతాలమాలి దేవరింటిలో పూజలు చేశారు. ఆదివారం ఉదయం పెళ్లి కాని యువకులు మంగళస్నానాలు ఆచరించి గ్రామంలోని యువకులు, గ్రామ పెద్దలతో కలిసి ప్రసాదాలు, నైవేద్యాలు తయారు చేసిన బోనాలు నెత్తిన పెట్టుకుని సంప్రదాయబద్ధంగా మంగళ వాయిద్యాలు, బాణసంచాలతో వెళ్లారు. మల్లారమ్మ చలగోలమ్మకు పూజలు చేశారు. అనంతరం కొండమూల దగ్గర ఉన్న బైరేగుని కొండకు వెళ్లి అక్కడున్న బైరేగుని గుడిలో పూజలు నిర్వహించారు. జంతుబలులు సమర్పించారు.

దూదేకులకూ షాదీతోఫా పెంపుపై హర్షం

కడప కార్పొరేషన్ : దూదేకుల కులస్తులకూ ప్రభుత్వం వైఎస్సార్ షాదీతోఫా కింద ఇచ్చే మొత్తాన్ని రూ. లక్షకు పెంచడంపై నూర్‌బాష్, దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.బాదుల్లా హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఇందుకోసం కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే దూదేకులకు రాజకీయంగా, ఆర్థికంగా, సంక్షేమ పరంగా మేలు జరిగిందన్నారు. దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని జిల్లాకు చెందిన మహిళను ఎంపిక చేసి ముఖ్యమంత్రి ఆప్యాయతను చాటుకున్నారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా దూదేకుల సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగిడాల పెద్దన్న, సీనియర్ నాయకుడు ఖాదరయ్య, సాయి హుస్సేన్, సిద్దయ్య, సుభాన్, రెడ్డెయ్య, కమాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాదుల్లా

సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోని ముస్లింలకు షాదీతోఫా కింద ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తోందని నూర్ బాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి తెలిపారు. ఇస్లాం మతాన్ని ఆచరించే నూర్ బాషా, దూదేకుల, పింజరి, లద్దాఫ్ కులస్తులను బీసీ–బీగా పరిగణిస్తుండటంతో రూ.50 వేలు మాత్రమే వచ్చేవని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వీరికి కూడా వైఎస్సార్ షాదీ తోఫాకి ఇచ్చే మొత్తాన్ని రూ.లక్షకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

అట్లూరు : మండలంలోని మణ్యంవారిపల్లె ఎస్సీ కాలనీలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానిక ఎస్ఐ కె.సి.రాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇరకతోటి శ్రీదేవి (33) అనే వివాహిత ఆదివారం అనుమానాస్పద స్థితిలో మరణించింది. మృతురాలి తండ్రి చిన్నబాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

చెయ్యేరులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



రాజంపేట : చెయ్యేరు (రాజంపేట పరిధి)లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహం సమీపంలో పురుగుల నివారణ మందు బాటిల్ ఉంది. దీంతో ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు. ఇతని ఆచూకీ, వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని మన్నూరు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 91211100573, 9121100572కు సంప్రదించాలని వివరించారు.

ఏపీఎన్ఆర్‌టీఎస్ చొరవతో స్వస్థలానికి యువకుడు

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు అసోసియేషన్ (ఏపీఎన్ఆర్‌టీఎస్), కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఓ యువకుడు కువైట్ నుంచి క్షేమంగా స్వస్థలానికి చేరాడు. వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా కమలాపురానికి చెందిన షేక్ మౌలాలి నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం కువైట్ వెళ్లాడు. తాను పని చేస్తున్న కంపెనీలో పని ఎక్కువగా ఉండటం, జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల కంపెనీ నుంచి బయటికి వచ్చాడు. బయటి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ కంపెనీ వారు అతను పారిపోయినట్లు కేసు పెట్టి అకామా (రెసిడెన్సీ) రెన్యువల్ చేయలేదు. ఇదిలా ఉండగా నెలక్రితం బీపీ, షుగర్ ఎక్కువై అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు. అతని పరిస్థితిని వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చి, అతన్ని ఇండియా రప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఎం.బాలిరెడ్డికి ఫోన్ చేసి మౌలాలి ఆరోగ్యం సరిగా లేనందున వెంటనే ఇండియాకు పంపే ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన బాలిరెడ్డి ఆసుపత్రికి వెళ్లి మౌలాలిని పరామర్శించారు. అతను ఆసుపత్రి నుంచి డిశార్చి అయిన వెంటనే భారత రాయబార అధికారులను ఒప్పించి ఔట్ పాస్‌పోర్టు తయారు చేయించారు. 20 రోజులు అతనికి వసతి, భోజన సదుపాయాలు కల్పించడంతోపాటు, విమాన టికెట్‌కు రూ.20 వేలు ఆర్థిక సాయం చేసి ఈనెల 15న ఇండిగో విమానం ద్వారా పంపించారు. 16వ తేది మౌలాలి సురక్షితంగా కమలాపురం చేరుకున్నాడు. ఈ సందర్భంగా మౌలాలి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న తనను మళ్లీ పుట్టిన ఊరికి రావడానికి కారణమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్, రీజనల్ కో ఆర్డినేటర్ బాలిరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


షేక్ మౌలాలికి ఔట్ పాస్‌పోర్టు అందజేస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ బాలిరెడ్డి

ఉత్సాహంగా అండర్–19 టోర్నమెంట్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 2 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 91 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 383 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ వర్మ 64, ప్రణవ్‌రెడ్డి 78, ప్రణీల్‌రెడ్డి 74 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు బాలాజీ 3, బ్రహ్మతేజారెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 104 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

కొనసాగుతున్న కర్నూలు ఆధిక్యం

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. 17 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండో రోజు 60.1 ఓవర్లలో 259 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని జి. మనిత్ 91 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ అక్షిత్‌రెడ్డి 6 వికెట్లు, భార్గవ్ చంద్రప్రసాద్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 37 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. జట్టులోని ఎ. సాయిసూర్యతేజారెడ్డి 63 పరుగులతో క్రీజులో ఉన్నాడు. నెల్లూరు బౌలర్లు సుతేజ్‌రెడ్డి 2, అబ్దుల్ 2, చిన్నబాబు 2 వికెట్లు తీశారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి కర్నూలు జట్టు 274 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.


క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న కడప, చిత్తూరు జట్లు


ప్రణవ్‌రెడ్డి (78 పరుగులు)


అక్షిత్‌రెడ్డి (6 వికెట్లు)

చీనీ చెట్ల నరికివేత


పొలంలో నరికివేసిన చీనీ చెట్లు

సింహాద్రిపురం : మండల పరిధి బొజ్జాయిపల్లె గ్రామంలో వెంకట్‌రెడ్డి అనే రైతుకు చెందిన చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. వివరాలలోకి వెళితే.. రైతు వెంకట్‌రెడ్డి తన మూడు ఎకరాల పొలంలో చీనీ మొక్కలను సాగు చేశారు. వాటిలో 24 మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నరికివేసినట్లు బాధితుడు తెలిపారు. వెంకట్‌రెడ్డి సోదరుడి కుమారుడు రిషికేశవరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తొండూరు ఎస్ఐ హనుమంతు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, వై.యస్.ఆర్.జిల్లా.
టెండర్ ప్రకటన

టెండర్ నోటీసు నెం:2623/యస్.ఈ/మెషినరీ రిపేర్లు/2023-24, తేది:15-07-2023

కడప నిర్మితి కేంద్రము, opp. రాజీవ్ గృహ కల్ప, షిరిడి సాయి ఎలెక్ట్రికల్ ప్రక్కన, శివానందపురము, కడప ఆవరణము నందు గల స్క్రాప్ ఇనుము మరియు సామాగ్రి విక్రయించుట కొరకు ఓపెన్ టెండరు ద్వారా కొటేషన్లు ఆహ్వానించడమైనది.

1) సీల్డ్ కొటేషన్ల గడువు తేది : 17-07-2023-10.00 AM నుండి 20-07-2023 - 5.00 PM వరకు
2) కొటేషన్లు దాఖలా పరచు కార్యాలయము: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయము, ఓ-బ్లాకు, కొత్త కలెక్టరేట్ కాంపౌండ్, వై.ఎస్.ఆర్.జిల్లా.
3) నమూనా కొటేషను కొరకు పై కార్యాలయము నందు పైన పేర్కొనిన తేదిలందు 10-30 AM నుండి 5.00 PM వరకు సంప్రదించ గలరు.

జిల్లా అధికారి, ఆం.ప్ర. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, వై.యస్.ఆర్. జిల్లా.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ ఒకే సం॥లో డిస్కంటిన్యూ విద్యార్థులకు 10th, ఇంటర్, డిగ్రీ, PG, Diploma, B.Tech, BCA, MCA, MBA పాసయ్యే ఛాన్స్ కలదు. కడప. 75694 70023 [G-7405]

SPOKEN ENGLISH

■ Fee 10% Online 'or' Offline Class Fluent anglo Communicative, Teachniques on ford Combridge Standanury (No Telugu). Cont: PVR Institute, Proddatur. Cell: 9888266623. [C-777108]

శ్రీ శ్రీనివాస I.T.I ప్రొద్దుటూరు

■ సం॥నకు ఎలక్ట్రీషియన్, Rs. 12,500/-లు, సివిల్ Rs.10,000/-లు, అన్ని ఫీజులు కలిపి. అడ్మిషన్ల కొరకు వెంటనే సంప్ర: 9490633112. [C-777109]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1468]

వికాస్ అకాడమి

■ 2023 సైనిక్, నవోదయ సాధించిన సీట్లు, సైనిక్ స్కూల్: 22, నవోదయ: 17, అడ్మిషన్లు జరుగుచున్నవి. నర్సరీ to 7th Class. Cont: శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి హిమ్స్, భరత్‌సింగ్ నగర్, ఊటుకూరు, కడప. సెల్: 9390821596. [C-1216539]

SERVICE

శ్రీ మహాలక్ష్మి మ్యారేజ్ లింక్స్

■ 7/562-A-4, IInd Floor, NGO కాలని, కడప 1st, 2nd, Widow, Late Marriage, Widowes, All Castes, దేశ/ విదేశీ సంబంధాల కొరకు సంప్రదించగలరు: 7899499023. [C-1216597]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 6192]

పేరు మార్పు

■ చెంగా శివయ్య తండ్రి చెంగా నారాయణ డోర్ నెం. 4/61, రామపట్టె, చెన్నూరు మండలము,వై.యస్.ఆర్ కడప జిల్లాలో నివాసం ఉన్నాను. నా ఆధార్ కార్డు నెం. 854980597305. నా యొక్క పాస్ పోర్టు K2988826 నందు CHINGA SIVAIAH నా పుట్టిన తేది 12.06.1988 నా యొక్క ఆధార్ కార్డు నందు CHENGA SIVAIAH అని పేరు పుట్టిన తేది 12.06.1990 మార్పుచేయడం జరిగింది. ఇక మీదట పాస్ పోర్టులో కూడా CHENGA SIVAIAH అని పిలువ బడుతుంది. ఇలాగే నేను భవిష్యత్తులో కూడా నా పేరును, పుట్టిన తేదిని కొనసాగిస్తాను తెలియజేసుకుంటున్నాను. [C-1216690]

WANTED

■ ప్రముఖ టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్, టెలికాలర్స్ కావలెను. దేవుని కడప రోడ్డు, మాసాపల్లి బస్టాండ్, కడప. అనుభవం గల వారికి ప్రాధాన్యత, ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 6304033780. [C-777107]

■ కడపలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో పెట్రోలు పట్టుటకు బాయ్స్/గర్ల్స్ కావలెను. జీతం: 11,500, న్యూ RTC బస్టాండ్. సంప్ర: 9705826592. [C-1216599]

■ శ్రీ విద్య ఎడ్యుకేషనల్ సర్వీసెస్ నందు పనిచేయుటకు Female Computer Operators, Counsellors, Telecaller కావలెను. Qualification : Degree/ B.Tech/ MBA/ MCA (Pass/Fail), Salary : 7K-12K, Address: RS Road, Nagarjupeta. Contact Numbers: 6303208193, 9949793884. [C-1216691]

■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీ నందు 39 మంది స్త్రీ/పురుషులకు ఉద్యోగాలు కలవు. జీ: 14000+DA6000 + ఫ్రీ రూమ్ + ఫుడ్, అర్హత-7th to డిగ్రీ, సంప్ర: చెన్నూరు బస్టాండ్ దగ్గర, కడప. 9502400350. [A-7575]

■ వర్ధిత ఫైనాన్షియర్ (D.S.A నందు) పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (కార్ & కమర్షియల్‌లోన్స్) Q: ఇంటర్/డిగ్రీ+ 2సం॥ అనుభవం. జీ॥20వేలు / ఆపైన ✆ 93906 50048, 99591 80161- స్టోన్ హౌస్‌పేట - నెల్లూరు. [O-787287]

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ యువకులకు అవకాశం కలదు. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 30. నో ఫీజు. సెల్: 9177342337. [WA-6999]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6190]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9346276788. [M-1221456]

■ ప్రముఖ కార్గో కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు క్యాబిన్ క్రూలోజింగ్ ఫుల్ సర్వీసెస్, ఆఫీస్ ఎడ్మిన్, సూపర్‌వైజర్స్, గ్రౌండ్ స్టాఫ్, టీమ్ లీడర్స్ కావలెను. Qul : 10th to any Degree, డిప్లొమా, ITI, Age : 18 to 35, భోజనం + రూమ్ వసతి, జీతం. 25,000 to 32,000/- ✆ 81255 60645 [B-1193467]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



నీటి కుంటలో పడి వ్యక్తి మృతి


పోతురాజు మృతదేహం

పులివెందుల : పట్టణంలోని రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా ఉలవలపాడు గ్రామానికి చెందిన పోతురాజు(38) పులివెందులకు కొన్ని నెలల క్రితం వచ్చి బేల్దారి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మరి కొంత మందితో కలిసి సరదాగా రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో ఈత కోసం వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఆయన ఈత కొడుతూ నీటిలో కనిపించకుండా గల్లంతయ్యాడు. దీంతో అక్కడి వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీం నీటి కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. నీటిలో మునిగి చనిపోయిన పోతురాజును బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోతురాజుకు భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బైక్‌లు ఢీకొని ఐదుగురికి గాయాలు


గాయపడిన బాధితులు

పెద్దతిప్పసముద్రం : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలోని చేలూరు రోడ్డులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం మల్‌రెడ్డిపల్లి పంచాయతీ ఎరబల్లికి చెందిన విశ్వనాథ్ (20), వనజ (25), గౌతమ్ (8), సుతిశ్రీ (6), విష్ణువర్ధన్ (15)లు పుట్టిన రోజు వేడుకల కోసం అబ్బురోళ్ళపల్లికి వెళుతుండగా.. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వీరంతా గాయపడ్డారు. స్థానికులు గమనించి బాధితులను చేలూరులోని ఓ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. వనమారెడ్డిగారిపల్లెకు చెందిన రైతు వై.శంకర్‌రెడ్డి(42) శనివారం సొంత పనులపై ద్విచక్రవాహనంలో సీటీఎం గ్రామానికి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి రాత్రి వనమరెడ్డిగారిపల్లెకు వస్తుండగా మార్గంమధ్యలోని మిట్టపల్లె వద్ద ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు శంకర్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు.


చికిత్స పొందుతున్న శంకర్‌రెడ్డి

చైన్ స్నాచింగ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని మహేశ్వనగర్ కాలనీ సమీపంలో రోడ్డుపైన వాకింగ్ చేస్తున్న రామలక్షుమ్మ మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామలక్షుమ్మ తోటి మహిళలతో కలసి వాకింగ్ చేస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు స్కూటర్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. ఈ సమయంలో ఆమె కింద పడింది. బంగారు చైన్ సుమారు రెండున్నర తులాలు ఉంటుంది. పట్టణ సీఐ ఈశ్వరయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆ వీధిలో సీసీ పుటేజీని పరిశీలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

కోర్టు తీర్పును అనుసరించి కార్యాచరణ

వైవీయూ : డిగ్రీ కళాశాలల ఫీజుల అంశం హైకోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో, న్యాయస్థానం ఇచ్చే తుది తీర్పును అనుసరించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు వైవీయూ అనుబంధ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ప్రైవేట్ కళాశాలల కరస్పాండెంట్లు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జీఓ నంబర్ 22ను అనుసరించి ఏపీ హెచ్ఈఆర్ఎంసీ నిర్ధారించిన డిగ్రీ ఫీజులు సమంజసంగా లేవని, వాటిని పున:పరిశీలించి, పెంచాలని డిమాండ్ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా డిగ్రీ అడ్మిషన్లలో 25 శాతం కంటే తక్కువ ఉన్న కళాశాలలకు అనుమతులు రద్దు చేయడం సరికాదని, వెంటనే పునరుద్ధరించాలని కోరారు. డాటా ఆన్‌లైన్‌లో సకాలంలో పూర్తి చేయని వారికి ఒక్క కోర్సుకు ప్రాసెసింగ్ ఫీజును రూ.75 వేలు అపరాధ రుసుంతో కట్టించుకున్న తర్వాత కూడా 2023–24 విద్యా సంవత్సరానికి అనుమతులు ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘాల ప్రతినిధులు జి.సుబ్బారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, విజయ్ కుమార్, సాయికృష్ణ, నరసింహులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘాల నాయకులు

సరదాగా ఆడుకుంటూ.. విద్యుత్ షాక్‌కు గురై..


అఖిల్ కుమార్‌రెడ్డి (ఫైల్)

మైదుకూరు : ఆదివారం ఆటవిడుపు ఆ బాలుడి పాలిట మృత్యువుగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. సాయంత్రం పూట సరదాగా క్రికెట్ ఆడుకుంటూ బంతి కోసం వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటన మైదుకూరు మున్సిపాలిటీలోని చిన్నయ్యగారిపల్లెలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నయ్యగారిపల్లెకు చెందిన శ్రీయపురెడ్డి సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమార్తె సుహారిక పదో తరగతి, కుమారుడు అఖిల్ కుమార్‌రెడ్డి (13) ఏడో తరగతి మైదుకూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో సాయంత్రం సరదాగా పిల్లలతో కలసి క్రికెట్ ఆడుకుంటూ ఇంటి వద్ద ఉన్న బంతి కోసం ఇంటికి వచ్చాడు. ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకపై బంతి ఉండటంతో.. మిద్దెపైకి వెళ్లి పశువులపాక పైకప్పుగా వేసిన రేకులపైకి చేరుకున్నాడు. పాకలో పశువుల కోసం ఏర్పాటు చేసిన కరెంటు బల్బు తీగ రేకులకు తగిలి ఉండటంతో.. ఒక్క సారిగా విద్యుదాఘాతానికి గురై ఎగిరి కింద పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేయడంతో తల్లిదండ్రులు బాలుడిని చికిత్స కోసం మైదుకూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యుడు తెలపడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో బాలుడి మృతి సంఘటన విషాదఛాయలు నింపింది.